ఒక్క నిర్మాణాన్ని కూడా కూల్చకుండానే..



2003కు ముందు: చుంగ్ గై వాగుమీద నిర్మించిన ఫ్లైఓవర్



2005 తర్వాత: చుంగ్ గై వాగు పునరుజ్జీవం తర్వాత..

# గోల్‌మాల్.. మూసియోల్

## మూసీ పేరిట కాంగ్రెస్ సర్కార్ విదేశీ యాత్ర • 20 మంది బృందంతో నేడు దక్షిణ కొరియా టూర్

చుంగ్ గై చున్ ప్రాజెక్టు సందర్శన కోసం సియోల్‌కు • మూసీ నదికి, చుంగ్ వాగుకి మధ్య ఎన్నెన్నో తేడాలు

నదికి, వాగుకి తేడా తెలియకుండా కోట్ల ప్రజాధనం వృథా • గతంలో 'థేమ్స్'.. ఇప్పుడు సియోల్ పేరిట ఆర్భాటం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు లండన్‌లోని థేమ్స్ ప్లాన్‌ను అమలు చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటించిన రేవంత్ ప్రభుత్వం అభాసుపాలైంది. 'థేమ్స్ యాక్షన్ ప్లాన్'లో కీలకమైన సీవరేజీ ట్రీట్మెంట్‌ను చేపట్టకుండా మూసీ పరీవాహకంలోని పేదల ఇండ్ల కూల్చివేతలే లక్ష్యంగా ముందుకెళ్లిన సర్కారుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. 'అసలు థేమ్స్ యాక్షన్ ప్లాన్ ఏంటో తెలుసా?' అంటూ ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌తో పాటు 'నమస్తే తెలంగాణ' దినపత్రిక తన వరుస కథనాలతో సర్కారును నిలదీసింది. దీంతో మూసీ ప్రాజెక్టును సమర్థించుకోవడానికి రేవంత్ బృందం కొత్తగా దక్షిణ కొరియా పర్యటనకు సిద్ధమైంది. ఇప్పటివరకు మూసీ రివర్‌ఫ్రంట్, మూసీ సుందరీకరణ పేరిట ప్రచారం చేసుకున్న ప్రభుత్వం.. ఇప్పుడు నది పునరుజ్జీవం పేరిట కొత్త రాగం అందుకున్నది. ఇందులో భాగంగా ఆదివారం దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని చుంగ్ గై చున్ రీస్టోరేషన్ ప్రాజెక్టు పరిశీలనకు హైదరాబాద్ నుంచి 20 మందితో కూడిన బృందం వెళ్లనున్నది. అయితే, మూసీ ప్రాజెక్టుకు, ఎక్కడో సియోల్‌లో ఉన్న చుంగ్ గై చున్ ప్రాజెక్టుకు సంబంధమేంటి? అనే ప్రశ్న ఇప్పుడు అంతటా వినిపిస్తున్నది.

### అసలేమిటీ ప్రాజెక్టు? దాని చరిత్రేంటి?

సియోల్ నగరం మధ్య నుంచి చుంగ్ గై చున్ అనే వాగు ప్రవహిస్తున్నది. ఇది నది కాదు. ఓ పిల్ల వాగు. సియోల్‌లో 13.7 కిలోమీటర్ల మేర ప్రవహించి చివరకు హన్ నదిలో కలుస్తుంది. 20వ శతాబ్దం మొదట్లో ఈ చుంగ్ వాగు వెంబడే ప్రజలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఏండ్లు గడిచాయి. పెరిగిన జనాభాతో పాటే వాగులో వ్యర్థాలు చేరడం ఎక్కువైంది. దీంతో నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు వాగులో కలువనీయకుండా అప్పటి ప్రభుత్వం మురుగునీటి పారుదల వ్యవస్థను నిర్మించింది. వాణిజ్య కార్యకలాపాలు పెరుగడంతో ఆ ప్రాంతాన్ని సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సీబీడీ)గా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. వాగుకు ఇరువైపులా వాణిజ్య నిర్మాణాలు ఏర్పాటైనా రద్దీకి తగిన రవాణా వ్యవస్థ ఏర్పాటు కాలేదు. దీంతో 1958లో అప్పటి ప్రభుత్వం పిల్లర్ల సాయంతో వాగు మీద (వాగు పొడవునా) కాంక్రీటు స్లాబ్ నిర్మించింది. దానిపై రహదారులు, ఫ్లైఓవర్లు కట్టింది. రవాణా సదుపాయాలు పెరగడంతో ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందింది. ఫ్లైఓవర్లు, రహదారులకు ఇరువైపులా భారీ భవంతులు వెలిశాయి.



చుంగ్ గై చున్ వాగులో దెబ్బతిన్న ఫ్లైఓవర్ పిల్లర్లు

| | | |
|---|---|---|
| మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు | ప్రాజెక్టు పేరు | చుంగ్ గై చున్ రీస్టోరేషన్ ప్రాజెక్టు |
| నది | జలవనరు స్వరూపం | వాగు |
| మూసీనది అభివృద్ధి | ప్రాజెక్టు లక్ష్యం | చుంగ్ గై చున్ వాగు పునరుజ్జీవనం |
| జరిగింది | ఇండ్ల కూల్చివేత | జరుగలేదు |
| పూర్తిగా కలుషితమైంది | ప్రాజెక్టుకు ముందు స్థితి | స్వచ్ఛంగానే ఉంది |
| హైదరాబాద్, తెలంగాణ | ప్రాజెక్టు చేపట్టిన ప్రాంతం | సియోల్, దక్షిణ కొరియా |
| 250 కిలోమీటర్లు | మొత్తం పొడవు | 13.7 కిలోమీటర్లు |
| 55 కిలోమీటర్లు | ప్రాజెక్టు చేపట్టిన పొడవు | 10.92 కిలోమీటర్లు |
| రూ. 1.5 లక్షల కోట్లు | ప్రాజెక్టు వ్యయం | రూ. 2,300 కోట్లు |
| రూ. 2,727 కోట్లు | కిలోమీటరుకు వ్యయం | రూ. 210 కోట్లు |
| ప్రపంచబ్యాంకు, ఏఐఐబీ, ఎన్డీబీ | నిధులు సమీకరణ | సియోల్ మెట్రోపాలిటన్ గవర్నమెంట్ |
| సింగపూర్ కంపెనీ మెయిన్‌హార్ట్ | ప్రాజెక్టు ప్లానింగ్ | సియోల్ మెట్రోపాలిటన్ గవర్నమెంట్ |

### అలా తెరమీదకు ప్రాజెక్టు..

ఐదారు దశాబ్దాల పాటు బాగానే ఉన్నా తర్వాత పరిస్థితులు మారిపోయాయి. వాగు నీటిలో ఏండ్లకేండ్లు నానడంతో ఫ్లైఓవర్ల పిల్లర్లు కుంగాయి. వాటిని తొలగించడం లేదా పునర్నిర్మించక తప్పని పరిస్థితి తలెత్తింది. అన్నివర్గాల అభిప్రాయాలను తీసుకున్న ప్రభుత్వం.. పర్యావరణ వేత్తల సూచనల మేరకు చుంగ్ గై చున్ పునరుజ్జీవ ప్రాజెక్టు (చుంగ్ గై చున్ రీస్టోరేషన్) చేపట్టింది. ఇందులో భాగంగా ముందుగా సీబీడీకి అనుసంధానంగా నగరంలోని మిగతా ప్రాంతాలకు ఆరు, ఎనిమిది లేన్ల రహదారులు నిర్మించింది. అలా చుంగ్ గై చున్ వాగు మీద ఫ్లైఓవర్లపై ట్రాఫిక్‌ను నియంత్రించి చుట్టూ ఉన్న భవనాలను కూల్చకుండానే ఎంతో జాగ్రత్తగా ఫ్లైఓవర్లు, రహదారులను తొలగించింది. తర్వాత వాగు ఒడ్డున పార్కులు, విద్యుత్తు దీపాలతో సుందరీకరణ పనులు చేపట్టింది. చిన్న వాహనాల కోసం వాగు ఇరువైపులా రోడ్లు నిర్మించింది. అలా 2003లో ప్రారంభమైన చుంగ్ గై చున్ రీస్టోరేషన్ ప్రాజెక్టు 2005లో పూర్తయింది. ఇప్పుడు ఆ ప్రాజెక్టును చూసేందుకే తెలంగాణ నుంచి 20 మందితో కూడిన బృందం సియోల్ వెళ్తున్నది.

### వెళ్తున్నది అందుకేనా?

మూసీ రివర్‌ఫ్రంట్‌కు 'థేమ్స్ మాడల్'ను అమలు చేస్తున్నామంటూ ఊదరగొట్టిన రేవంత్ ప్రభుత్వం.. పేదల ఇండ్లను కూల్చడమే లక్ష్యంగా ముందుకు వెళ్లింది. దీంతో అసలు రేవంత్ ప్రభుత్వం థేమ్స్ మాడల్‌ను అమలు చేయట్లేదని అందరికీ అర్థమైంది. ఈ క్రమంలోనే రైతు రుణమాఫీ, రైతు భరోసా హైడ్రా కూల్చివేతలు, గ్రూప్స్ అభ్యర్థుల ఆందోళనలు, రాష్ట్ర అప్పులు, నల్లమలలో రాడార్ స్టేషన్ ఏర్పాటు ఇలా ప్రభుత్వంపై అన్నివర్గాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత మొదలైంది. దీంతో ఈ సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ బృందం సియోల్ పర్యటనను తెరమీదకు తెచ్చిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. అంతేకాదు.. మొన్నటి వరకు మూసీ సుందరీకరణ, మూసీ అభివృద్ధి, మూసీ రివర్‌ఫ్రంట్ అని పేర్కొన్న సీఎం రేవంత్.. గురువారం ప్రెస్‌మీట్‌లో మూసీ పునరుజ్జీవం అని సంబోధించడం గమనార్హం. ఎందుకంటే, సియోల్‌లోని చుంగ్ గై చున్ వాగు మీద చేపట్టింది పునరుజ్జీవ (రీస్టోరేషన్) ప్రాజెక్టే కాబట్టి!

### పూర్తిగా సక్సెస్ ఏమీ కాదు..

సియోల్ నగరం వెలుస్తున్న సమయంలోనే చుంగ్ గై చున్ వాగులో వ్యర్థాలు పెరగడం మొదలైంది. దీంతో అక్కడి ప్రభుత్వం సీవరేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి చుంగ్ వాగు మీదనే ఫ్లైఓవర్లు నిర్మించింది. వాగును రక్షించాం అనుకున్నది. ఫ్లైఓవర్ల పునాదులు దెబ్బతినడంతో మళ్లీ వాగు రీస్టోరేషన్ ప్రాజెక్టు పేరిట వాటిని తొలగించింది. దీన్నిబట్టి చూస్తే చుంగ్ గై చున్ రీస్టోరేషన్ ప్రాజెక్టు పూర్తిగా విజయవంతమైనట్టు చెప్పడానికి లేదని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.



## అసలు పోలికలున్నాయా?



180 మీటర్ల వెడల్పుతో ప్రవహిస్తున్న మూసీ.. 20 మీటర్ల వెడల్పుతో చుంగ్ గై వాగు

### ఇది నది.. అది వాగు

మూసీ ప్రాజెక్టు కోసం సియోల్‌లోని చుంగ్ గై చున్ రీస్టోరేషన్ ప్రాజెక్టును రేవంత్ బృందం ఎందుకు పరిశీలిస్తున్నదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూసీ ఒక నది. దీని పొడవు 250 కిలోమీటర్లు. అందులో హైదరాబాద్ నగరంలో ప్రవహిస్తున్న 55 కిలోమీటర్ల మేర పొడవున్న నదికి ఇరువైపులా అభివృద్ధి పనులు చేపట్టాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తున్నది. 1908లో మూసీకి వచ్చిన వరదల నేపథ్యంలో 11-20 అడుగుల మేర వరద అఫ్జల్‌గంజ్ ప్రాంతాన్ని ముంచెత్తినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. 180 మీటర్ల వెడల్పుతో ప్రవహించే మూసీ నదిలో ఒక్కరోజులోనే 4,25,000 క్యూసెక్కుల ప్రవాహం కూడా వచ్చినట్టు ఆధారాలు ఉన్నాయి. సియోల్‌లోని చుంగ్ గై చున్ ఓ పిల్ల వాగు. వెడల్పు సగటున 20 మీటర్లుగా ఉన్నది. నీటిమట్టం మూడడుగుల కంటే తక్కువ. ఐదారేండ్ల పిల్లలు కూడా ఈ వాగులో దిగి ఆడుకుంటారు. చుంగ్ గై చున్‌కు వరదలు వచ్చిన చరిత్ర అసలే లేదు. దీన్నిబట్టి.. ఏ విధంగా చుంగ్ గై చున్ రీస్టోరేషన్ ప్రాజెక్టును మూసీ విషయంలో అన్వయిస్తారన్న సందేహాలు కలుగుతున్నాయి.



20వ శతాబ్దం తొలినాళ్లలో చుంగ్ గై చున్ వాగు పరిసరాలు

### నగరం వెలుస్తున్న సమయంలోనే..

సియోల్ నగరం వెలుస్తున్న సమయంలోనే చుంగ్ గై చున్ వాగులో వ్యర్థాల కట్టడికి అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. సీవరేజీ వ్యవస్థ ఏర్పాటు చేసింది. రవాణా సదుపాయం కల్పించడంలో భాగంగా మొదట వాగుపైనే ఫ్లైఓవర్లు నిర్మించి తర్వాత రీస్టోరేషన్‌లో భాగంగా వాటిని తొలగించింది. శతాబ్దాల కిందటే మూసీకి ఇరువైపులా నివాసాలు ఏర్పడ్డాయి. 450 ఏండ్ల తర్వాత ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం మూసీ పునర్జీవం పేరిట ప్రాజెక్టు చేపడుతున్నది. సియోల్ నగరం ఏర్పడ్డప్పుడే అక్కడి ప్రభుత్వం ప్రాజెక్టు చేపట్టగా, ఇక్కడ మాత్రం 450 ఏండ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా మూసీ ప్రాజెక్టు చేపడుతున్నది.



పక్కనున్న భవనాలు కూల్చకుండానే చుంగ్ గై వాగు పునరుజ్జీవ ప్రక్రియ

### అక్కడ కూల్చివేతలు లేనే లేవు

చుంగ్ గై చున్ వాగు రీస్టోరేషన్ ప్రాజెక్టులో ఎక్కడా ఒక్క నిర్మాణాన్ని కూడా కూల్చలేదు. పైగా వాగు సుందరీకరణ సమయంలో వాణిజ్య కార్యకలాపాలకు అడ్డంకులు ఏర్పడుతున్నట్టు గమనించిన అక్కడి సర్కారు.. వ్యాపారులకు పన్నులను తగ్గించింది. పార్కింగ్ సదుపాయాలు కల్పించింది. వాణిజ్య కార్యకలాపాల పనిగంటలను పెంచింది. మూసీ ప్రాజెక్టు ప్రారంభం కాకముందే ఇక్కడ రేవంత్ ప్రభుత్వం ఇండ్లు కూల్చేస్తున్నది. బాధితులకు తగిన పరిహారం కూడా ఇవ్వడంలేదన్న విమర్శలూ ఉన్నాయి.

### సీవరేజీ ట్రీట్మెంట్ ఎలాగంటే??

చుంగ్ గై చున్ వాగులో వ్యర్థాలు కలువకుండా ముందుగానే అధికారులు పారిశుద్ధ్య వ్యవస్థ ఏర్పాటు చేశారు. ఫ్లైఓవర్ల నిర్మాణం తర్వాత కొంత మొత్తం వ్యర్థాలు వాగులో చేరినా, ముందుగా సీవరేజీ ట్యాంకులు ఏర్పాటు చేసిన అధికారులు నీటిని శుద్ధి చేశారు. ఆ తర్వాతే రీస్టోరేషన్ ప్రాజెక్టు చేపట్టారు. మూసీ విషయంలో ముందుగా సీవరేజీ ట్రీట్మెంట్ చర్యలు చేపట్టకుండానే ఇండ్లు కూల్చేస్తుండటం గమనార్హం. మూసీ పరీవాహకం సుందరంగా కనిపిస్తుందో? లేదో? గాని, నదిలో మురుగు మాత్రం అలాగే ఉండి దుర్గంధం వెదజల్లడం ఖాయమని ఢిల్లీకి చెందిన ఓ పర్యావరణ నిపుణుడు పేర్కొన్నారు.

# మూసీ వద్ద మూడేండ్లు ఉంటా

సీఎం చెప్పినట్టుగా సుందరీకరణ ఆపేస్తారా? • పేదలను ఆగం చేస్తే చూస్తూ ఊరుకోబోం • సీఎం కుర్చీ కాపాడుకోవాలంటే చందాలిస్తాం

మూసీ బాగుకే కేసీఆర్ హయాంలో ఎస్టీపీల నిర్మాణం • బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ • నాగోల్ ఎస్టీపీని సందర్శించిన పార్టీ బృందం



నాగోల్‌లోని సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వివేకానంద, మాజీ మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 19(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్టుగా మూసీ వద్ద మూడు నెలలు కాదు.. మూడేండ్లు ఉంటే పేదల ఇండ్ల కూల్చివేతలు ఆపేస్తారా అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. నాగోల్‌లోని సీవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను శనివారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నప్పుడే మూసీకి సమీపంలో ఉండే నింబిలి అడ్డా, మొజాంజాహీ మార్కెట్ వద్ద ఉన్నానని చెప్పారు. అనుమతులు తీసుకొని, పన్నులు కట్టిన పేదలను కబ్జాకోరులుగా చిత్రీకరించడంపై మండిపడ్డారు. పేదల ఇండ్లను కూల్చివేసి, బస్టాండ్, మెట్రో స్టేషన్ ఎలా ఉంచుతారని ప్రశ్నించారు. మూసీ పేరిట సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా, ఇండ్లను కోల్పోతున్న పేదలకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. మూసీ వెంబడి ఇండ్లను కోల్పోతున్నవారికి అండగా నిలుస్తూ వారి తరఫున రాజ్యాంగ, న్యాయపరంగా రక్షణ కల్పిస్తామని, ఇప్పటికే 500 మందికి ఊరటనిచ్చేలా హైకోర్టులో స్టే ఆర్డర్లు వచ్చాయన్నారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్, ఎస్టిమేషన్ లేనప్పుడు పేదల ఇండ్లను ఎందుకు కూలగొడుతున్నారని ప్రశ్నించారు. ఇండ్లు ఖాళీ చేయాలంటున్న అధికారులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పేదలను ఇబ్బంది పెడితే బీఆర్‌ఎస్ సహించబోదని హెచ్చరించారు.



ప్లాంట్ వద్ద శుద్ధి చేయక ముందు, చేశాక నీటిని చూపిస్తున్న కేటీఆర్

### సీం కేసీఆర్ హయాంలోనే మూసీ బాగు

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీలు మూసీని మురికి కూపంలా మార్చితే, స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం మూసీని సుందరీకరణ చేపట్టినట్టు చెప్పారు. ఎస్టీపీలను సక్రమంగా నడిపితే నల్లగొండ జిల్లాకు పరిశుభ్రమైన నీరు వెళ్తుందని తెలిపారు. దక్షిణాసియాలోనే మొదటగా వంద శాతం మురుగునీటిని శుద్ధి చేసిన నగరంగా హైదరాబాద్ నిలిచిందని, ఇది కేసీఆర్ ఘనతేనని స్పష్టం చేశారు. గతంలోనే రూ. 3800 కోట్ల ఖర్చుతో ఎస్టీపీలను నిర్మించామని తెలిపారు. నగరంలో 57.5 కిలోమీటర్ల మేర ప్రవహించే మూసీకి పునరుజ్జీవం తేవాలంటే ముందుగా నీటిని శుద్ధి చేయాలని అప్పటి సీ ఎం కేసీఆర్ సంకల్పించారని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ మూసీ ద్వారా నల్లగొండకు మురుగు నీరు పంపితే, బీఆర్‌ఎస్ హయాంలో శుద్ధజలాలను పంపించే ప్రణాళికలను అమలు చేశామని చెప్పారు. బీఆర్‌ఎస్ కట్టిన ఇండ్లకు సున్నం వేసి కట్టిన గుంపు మేస్త్రీని తానేనని సీ ఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొంటున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మూసీని శుద్ధి చేసేందుకు కొండపోచమ్మ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లను మూసీ నదికి అనుసంధానం చేయాలని నిర్ణయించినట్లుగా తెలిపారు. దీనికి 2023లోనే రూ. 1100 కోట్లతో మూసీ అనుసంధాన పనులు చేపట్టినట్టుగా చెప్పారు. ఇక ఎస్టీపీలు, బ్రిడ్జిలు, గోదావరి అనుసంధానంతో మూసీకి పునరుజ్జీవం పోసిందే బీఆర్‌ఎస్ అని మరోసారి స్పష్టం చేశారు. మూసీ డెవలప్ అథారిటీ చైర్మన్‌గా సుధీర్‌రెడ్డి ఉన్నప్పుడే పనులన్నీ దాదాపు పూర్తి చేశామని తెలిపారు. అన్నింటికీ కలిపినా రూ. 25వేల కోట్లతో మూసీకి పూర్వ వైభవం వస్తుందని స్పష్టం చేశారు.

### చందాలిస్తాం.. సీఎం కుర్చీ కాపాడుకో

సీఎం రేవంత్ రెడ్డి కుర్చీ కాపాడుకునేందుకు కావాలంటే చందాలు వేసి నిధులు సమకూర్చుతామని ఎద్దేవా చేశారు. పేదల ఇండ్లను కూల్చి, అవినీతి మూటలు ఢిల్లీకి తరలిస్తామంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. 2400 కిలోమీటర్ల పొడవైన నమామి గంగే ప్రాజెక్టుకు ప్రధాని మోదీ రూ. 40వేల కోట్లు ఖర్చు చేశారని, మూసీ కోసం కిలోమీటర్‌కు రూ. 2700 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు.

### బ్యూటీఫికేషన్‌కు కాదు.. లూటిఫికేషన్‌కు వ్యతిరేకం

మూసీ బ్యూటీఫికేషన్‌కు బీఆర్‌ఎస్ వ్యతిరేకం కాదని, పేదలను రోడ్డుపై పడేసే లూటిఫికేషన్‌కు మాత్రమే తాము వ్యతిరేకమని కేటీఆర్ స్పష్టం చేశారు. బఫర్‌జోన్‌లో అనుమతులతో ఇండ్లు కట్టుకున్నవారిని కబ్జాదారులని సీఎం రేవంత్‌రెడ్డి ముద్ర వేస్తున్నారని మండిపడ్డారు. లక్ష మందిని రోడ్డున పడేసి, కోట్లాది రూపాయలు దోచుకుంటామంటే బీఆర్‌ఎస్ ఎలా మద్దతునిస్తుందని ఆయన ప్రశ్నించారు. మూసీ పేరిట లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని సీఎంను ప్రశ్నించారు. అవసరమైతే రెండు దిక్కుల కరకట్టలు కట్టి, ఎవరికీ నష్టం లేకుండా చేయాలని గానీ, బఫర్ జోన్ జోలికి వెళ్లకూడదని ప్రభుత్వానికి సూచించారు. పేదల ఇండ్లు కూల్చి, వారిని రోడ్డున పడేసి కట్టే మాల్స్ ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ దూకుడును తప్పుబట్టారు.